క్లుప్తంగా

ఏడుగురు జూదరుల అరెస్టు

లింగసముద్రం: పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం .సైదుబాబు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం మండలంలోని ముత్యాలపాడు గ్రామశివారుల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.5010 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సింగరాయకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేష్‌కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, మండల, గ్రామస్థాయి అధికారులు హాజరుకావాలని సూచించారు.

ముద్దసానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి గ్రామ శివార్లలో ఉన్న ముద్దసానమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రకాల పూలదండలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. జమ్మనపల్లి, కోలభీమునిపాడు, మార్కాపురం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందజేశారు.

రసీదులు తీసుకోవాలి

పుల్లలచెరువు: ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పకుండా రశీదులు తీసుకోవాలని వ్యవసాయాధికారి నిర్మలాదేవి సూచించారు. ఆమె ఆదివారం ప్రకటనలో తెలియచేస్తూ విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పని సరిగా ప్రభుత్వ నియమాలను పాటించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు రైతులు మొలకశాతం తెలుసుకోవాలన్నారు. 85 శాతం మొలకలు వస్తే మంచి విత్తనాలుగా భావించాలన్నారు. లేదంటే విత్తనాలను తిరిగి ఇచ్చేయాలన్నారు. తప్పని సరిగా రైతులు రశీదులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా లైసెన్స్‌లు ఉన్న దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు వేసిన పంట పూర్తి అయ్యే వరకు రశీదులు దాచుకోవాలని సూచించారు.

హడావిడి చేసి.. అభాసుపాలయ్యారు..!

● మున్సిపల్ కార్యాలయంలో మూలకు చేరిన మొండి బకాయిదారుల ఫ్లెక్సీలు



మున్సిపల్ కార్యాలయంలో మూలన పడేసిన ఫ్లెక్సీలు

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపల్ అధికారుల తీరును చూసి పట్టణ ప్రజలు నవ్వుకుంటున్నారు. అసలు హడావుడిగా రాత్రికి రాత్రి ఎందుకు పెట్టారు.. మళ్లీ మరుసటి రోజు రాత్రికి రాత్రి ఎందుకు ఫ్లెక్సీలను తొలగించి మూలనపడేశారు.. అంటూ పట్టణంలో జోరుగా చర్చ నడుస్తోంది. వాస్తవానికి గత 10 ఏళ్ల నుంచి ఫ్లెక్సీల్లో ముద్రించిన వారి పేర్లు మొండిపద్దుల జాబితాలోనే ఉన్నాయి. కానీ ఎప్పుడూ ఇలాంటి తొందరపాటు నిర్ణయం జరగలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నాలుగు రోజులు కాలేదు. ఇంకా అధికార పార్టీ నేతలు కనీసం బాధ్యతలు తీసుకోలేదు. కానీ వినూత్న ప్రక్రియ పేరుతో కనిగిరిలో గందరగోళం సృష్టించారు. కమిషనర్ ప్రకటించిన ఆ మొండిబకాయిల జాబితాలో అధికార పార్టీ నేతలే ఎక్కువ మంది ప్రథమస్థానంలో ఉన్నారు. దీంతో ఒక్కసారిగా అధికార పార్టీ అగ్ర నేతలు మున్సిపల్ ఉన్నతాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో మున్సిపల్ అధికారి ఒక్కసారిగా వెనుకడుగు వేశారు... అధికార భక్తిని చాటారు. నలుగురిలో అభాసుపాలయ్యారు. ఒక ఉన్నత స్థానంలో ఉండే అధికారి ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు ఆలోచించి ముందడుగు వేయాలి. కనీసం తాను చేసే పనిని మున్సిపల్ పాలవర్గం సమావేశంలో పెట్టి తీర్మానం చేయాలి. మెజార్టీ సభ్యుల ఆమోదం పొందాలి. కానీ ఇవన్నీ ఏమీ చేయకుండా అనాలోచితంగా నిర్ణయం తీసుకొని మున్సిపాలిటీని పరువు తీశారని కనిగిరి పురపాలక పాలక వర్గ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ

హనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

కనిగిరి రూరల్: హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి ఆవరణలో ఉత్సవ కమిటీ వాల్‌పోస్టర్, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. తొలుత జరిగిన సమావేశంలో కమిటీ నాయకులు మాట్లాడుతూ శోభాయాత్ర ఈ నెల 23న నిర్వహించనున్నట్లు చెప్పారు. గతేడాది కంటే అత్యంత వైభంగా శోభయాత్ర నిర్వహించేలా కమిటీ తీర్మానం చేశారు. వేలాది మంది భక్తులు హాజరయ్యేలా కమిటీ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 23న ఆదివారం సాయంత్రం 4 గంటలకు వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి కొత్తూరు అభయాంజనేయ స్వామి దేవస్థానం వరకు యాత్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శోభాయాత్ర ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వల్లూరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చనలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించి, వేటలు కోసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ రమేష్ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకుడు ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మహానివేదన, గోపూజ



విశిష్ట అలంకరణతో నారాయణస్వామి మూల విగ్రహమూర్తి



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహానివేదన, గోపూజ అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మలు వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాహాలులో గోపూజ నిర్వహించారు. ముందుగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. ప్రత్యేక పూజల సందర్భంగా స్వామి గర్భాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, నరేంద్రకుమార్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

అడ్మిషన్లకు అధ్యాపకుల క్యాంపెయిన్



అడ్మిషన్ల కోసం క్యాంపెయిన్ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పామూరు: 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్‌లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజశేఖర్ ఆధ్వర్యంలో అధ్యాకులు క్యాంపెయినింగ్ ప్రారంభించారు. పామూరుతో పాటు మండలంలోని పలుగ్రామాల్లో అదే విధంగా సీఎస్‌పురం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బృందాలుగా పర్యటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గత విద్యాసంవత్సరంలో 10లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటికి వెళ్లి పామూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో చేరాలని విద్యార్థులను, తల్లిదండ్రులను కోరారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫలితాల ప్రచారపత్రాలను అందజేస్తున్నారు. కళాశాలలో అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నారని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్, తెలుగుమీడియం ఉందన్నారు. ల్యాబ్‌సౌకర్యం, తరగతి గదులు పూర్తి వసతులు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జె.సురేష్‌రెడ్డి, జి.రమణయ్య, నాగభూషణం, రవికాంత్, జబీన్‌హసన్, బ్రహ్మయ్య, రాధిక, ఇసాక్, ప్రభాకర్, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి పొంగళ్లు



పొంగళ్లతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



బొల్లావులతో అమ్మవారి ప్రతిమల ఊరేగింపు



జమ్మిచెట్టు వద్ద బైనేటివారి కథ వింటున్న భక్తులు

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం పొంగళ్ల కార్యక్రమంతో ముగిసింది. గ్రామ నడిబొడ్డున కొలువై ఉన్న గంగమ్మ తల్లి అమ్మవారి ప్రతిమలను, బొల్లావులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై ఉంచి గ్రామంలోని అన్ని వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. అమ్మవారి పావనం ఎదురు యువకులు వీరతాళ్లు వేయించుకుంటూ, సంప్రదాయ నృత్యం చేస్తూ అలరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించారు. పొంగళ్లతో మహిళలు ఊరేగింపుగా జమ్మిచెట్టు వద్దకు చేరుకుని ప్రదక్షిణ చేశారు. అనంతరం రాజులు, ప్రధానులతో పూజలు చేయించారు. భక్తులకు బైనేటివారి కథ వినిపించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిరుణాళ్లను తిలకించారు. భక్తులకు గ్రామస్తుల సహకారంతో అన్నసంతర్పణ చేశారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు



దర్శనం కోసం క్యూలైన్‌లలో ఉన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పర్యాటక కేంద్రం, పుణ్యక్షేత్రం భైరవకోనకు ఆదివారం పర్యాటకులు, భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు ముగిసి 12 నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానుండటంతో ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో భైరవకోనకు వచ్చారు. ఈ సందర్భంగా జలపాతం వద్ద స్నానమాచరించి అనంతరం త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజల్లో ఆలయ మాజీ చైర్మన్ గుంటిమడుగు వెంకటరామరాజు, సుబ్బరత్నమ్మ దంపతులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలో ఎస్. కొత్తపల్లి గ్రామంలో శ్రీ శివనాగ అభయంజనేయస్వామి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం, గణపతి పూజ, తమలపాకు పూజ, కుంకుమార్చన, కలశ పూజలు అనంతరం పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నాగమయ్య పుట్టకు మహిళలు పాలు, పండ్లు సమర్పించి కుంకుమ, పసుపు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తి పాటలతో భజన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు.

అదుపుతప్పి గోడను ఢీ కొట్టిన పార్సిల్ వాహనం



గోడను ఢీకొట్టిన వాహనం

ముండ్లమూరు: మద్యం మత్తులో వాహనం నడుపుతుండటంతో అదుపు తప్పి పార్సిల్ వాహనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గోడను ఢీ కొట్టింది. ఈప్రమాదంలో డ్రైవర్ సత్యనారాయణకు గాయాలయ్యాయి. కనిగిరి మండల జమ్మలమడక నుంచి విజయవాడ వెళుతున్న న్యూ విజయజానకి పార్సిల్ వాహనంలో మిరపకాయల వ్యాపారి 70 మిరపకాయ టిక్కీలను వేసుకొని అందులో బయలుదేరారు. మార్గ మధ్యంలో దర్శి – అద్దంకి ప్రధాన రహదారిలో ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మద్యం మత్తులో రోడ్డుపై బ్రిడ్జి గోడను బలంగా ఢీ కొట్టడంతో అదుపుతప్పి ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సత్యనారాయణకు గాయాలయ్యాయి. అందులో ప్రయాణిస్తున్న మిరపకాయల వ్యాపారి త్రుటిలో తప్పించుకున్నాడు. ప్రమాద ధాటికి ప్రహరీ గోడ కుప్పకూలింది.

నైరుతి ఆగమనంతో వర్షాలు



గుడ్లూరులో నేల రాలిన మామిడి కాయలు



టంగుటూరులో జలమయమైన రోడ్లు

గుడ్లూరు: నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి 11 గంటల నుంచి ఆదివారం తెల్లవారు జామున 5 గంటలు వరకు ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు భారీ వర్షం కురిసింది. చేవూరు, రావూరు, ఏలూరుపాడు, సాలిపేట, తెట్టు, పోట్లూరు, గుడ్లూరు, చెమిడిదిపాడు గ్రామాల్లో భారీ వర్షం పడింది. మండల కేంద్రమైన గుడ్లూరులో నీలకంఠేశ్వర ఆలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మీద పిడుగు పడటంతో గుడ్లూరులో శనివారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే ఈదురుగాలులకు మామిడి తోటల్లో మామిడి కాయలు నేల రాలాయి. వర్షాలు పడుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

163.8 మి.మీ వర్షపాతం నమోదు

కనిగిరి రూరల్: కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో ఆదివారం 163.8 మి.మీల వర్షపాతం నమోదు కాగా సరాసరిన 12.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కనిగిరి మండలంలో 14.2 మి.మీ, వెలిగండ్లలో 6.2 మి.మీ, హెచ్‌ఎంపాడులో 13.2 మి.మీ, పామూరులో 19.8 మి.మీ, పీసీపల్లిలో 18.8, సీఎస్‌పురంలో 4.2 వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

లింగసముద్రంలో మోస్తరు వర్షం

లింగసముద్రం: మండలంలో శనివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉపరితల ఆవర్తనంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని గ్రామాలకు శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గత రెండు రోజులుగా చిరుజల్లులతో పాటు మోస్తరు వర్షం కురుస్తుండడంతో వాతావరణం చల్లబడి ఆహ్లాదకరంగా మారింది. దీంతో ఉక్కపోత, ఎండవేడిమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. పొలాలు దుక్కులు దున్నేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

టంగుటూరులో 20.4 మి.మీ వర్షపాతం

టంగుటూరు: నైరుతి రుతుపవనాల ప్రభావంతో టంగుటూరు మండలంలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. రోడ్లపై వర్షం నీరు ప్రవహించింది. రైతులు పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగు, మినుము, పెసర సాగు చేసి భూములను సారవంతం చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత సూచించారు. మండలంలో ఆదివారం 20.4 మి.మీ వర్షపాతం వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

మార్కాపురం: ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(ఆవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో 100 మంది పేద మహిళలకు చీరలు, పది మంది పురుషులకు పంచె, కండువాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఆవోపా ఆర్యవైశ్యులకే కాకుండా సమాజంలోని అందరికీ ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. దయాళ్‌బాగ్ స్టోర్ సహకారంతో నూతన దుస్తులు అందించినట్లు కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సూరె వెంకటేశ్వర్లు, కోశాధికారి కోటి మోహన్, ప్రతినిధులు సీహెచ్‌వీ సుబ్బారావు, రామశేఖర్, నాగేశ్వరరావు, పిచ్చిరావు, రామకృష్ణ, సురేష్, శ్రీనివాసులు, ఆదినారాయణ పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం ప్రాంత ప్రజల ఇలవేల్పు పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూల విగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. నాగ శిలలు, పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.